ప్రజలందరికీ పథకాలు అందేలా కృషి

- అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం
- అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే పాయం


మణుగూరురూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గంలోని అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అందేలా కృషి చేస్తానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని పగిడేరు గ్రామంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పగిడేరు గ్రామపంచాయితీ పరిధిలోని గ్రామాల్లో మంచినీటి సరఫరా, కరెంట్, ఇరిగేషన్ తదితర సమస్యలను గురించి ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారం రోజుల లోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు.

సమావేశంలో ఎంఈఓ వీరస్వామి, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, సీడీపీఓ జయలక్ష్మి, వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, ఇతర శాఖల అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు..

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో గ్రామానికి చెందిన 30కుటుంబాల వారు బీఆర్ఎస్‌పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పాయం కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన శాంతినగర్ ప్రాంతానికి చెందిన కుంజా సూర్యాన్ని ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. వైద్యఖర్చుల నిమిత్తం కొంత నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కట్టువాగు పూడికతీత పనులను బుధవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మణుగూరుకు ముంపు తలెత్తకుండా ముందు జాగ్రత్తలో భాగంగా కట్టువాగు పూడికతీత పనులను చాపల మార్కెట్ ఏరియాలో ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఇరిగేషన్ డీఈ రమేష్, ఏఈ సక్రు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజకీయ నాయకులతో సమావేశం

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వి.రాఘవరెడ్డి బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను సిద్ధం చేసి ఎంపీడీఓ, పంచాయతీ కార్యాలయాల నోటీస్ బోర్డుల్లో ఉంచినట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,04,297మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మరణించిన ఓటర్లు 1049 మంది, బదిలీపై వెళ్లిన వారు 1281, డబుల్ ఓట్లు 281 ఉన్నాయని తెలిపారు. మండలంలోని 13గ్రామపంచాయితీలకు సంబంధించి 59189 మంది ఓటర్లు ఉన్నారని, ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. సమావేశంలో రెవిన్యూ సిబ్బంది, రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కరకగూడెం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మండల పరిధిలోని రేగళ్ల, అల్లేరుగూడెం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా సుమారు 68 మంది గ్రామస్తులను పరీక్షించి అందులో పలువురిని జ్వర పీడితులను గుర్తించి మందులను అందజేసి మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విధిగా దోమ తెరలను వాడుతూ మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో కలియ తిరుగుతూ నిల్వ ఉన్న నీటినీ సిబ్బందితో పారబోయించారు. హెచ్ఈఓ పోలెబోయిన క్రిష్ణయ్య, ఆరోగ్య సహాయకులు నర్సింహారావు, కృష్ణ, ఆశా కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దుమ్ముగూడెం: అంగన్‌వాడీ కేంద్రాల నుంచి గర్భిణులకు, బాలింతలకు అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సుశీల సూచించారు. బుధవారం మండలంలోని సీతానగరం గ్రామలలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ మాసంలో భాగంగా తల్లులకు పోషకాహారాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలో ఇచ్చే పాలు, గుడ్లు ఆరోగ్యలక్ష్మి ద్వారా పెడుతున్న భోజనాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని, రక్తహీనత లేకుండా ఆకుకూరలు కూరగాయలు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఔట్రిచ్ వర్కర్ లతా, డి.హబ్ సంతోష్ రూపా, అంగన్‌వాడీ టీచర్స్ ఎస్.వీరమని భారతి, నాగమణి, శాంతాదేవి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

దమ్మపేట: మధ్యాహ్న భోజనం కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు, గుడ్లు బిల్లులు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం భోజనం కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ కార్యాలయంలో సిబ్బంది లక్ష్మణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. వంట కార్మికులకు ఇస్తున్న కొద్ది పాటి వేతనాలు, బిల్లులు నెల నెలా ఇవ్వటం లేదని, నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని అన్నారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల రూపాయలు ఇవ్వాలని, గుడ్లు, గ్యాస్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరమ్మ, కుమారి, జ్యోతి, బూదెమ్మ, శ్రీదేవి, కృష్ణవేణి, జయ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన సదస్సు

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు భాగ్య విభాగం ఆధ్వర్యంలో టీవీ ముక్త్ భారత్ క్యాంపెన్‌లో భాగంగా టీబీ, హెచ్ఐవీ వ్యాధులపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్జీఓ ఔట్రిచ్ వర్కర్ వరలక్ష్మి హెచ్ఐవీ వ్యాధి లక్షణాల గురించి వివరించగా, జిల్లా టీబీ కో-ఆర్డినేటర్ సోమయ్య క్షయ వ్యాధి లక్షణాల గురించి అవగాహన కల్పించారు. రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం బరువు తగ్గడం, రాత్రుళ్లు చెమటలు పట్టడం, దగ్గినప్పుడు తెమడలో రక్తం పడటం వంటివి ఉన్నట్లయితే దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చునని, మందులు వాడుతున్నంత కాలం నెల రూ.500 పోషణ భత్యం నిక్షయ పోషణ యోజన పథకం ద్వారా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ హవీలా, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాయమవుతున్న స్పీడు బ్రేకర్లు


స్పీడు బ్రేకర్లు తొలగించిన ప్రాంతం ఇదే..

చర్ల: మండలంలోని ప్రధాన రహదార్లపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకర్లు మాయమవుతున్నాయి. ప్రమాదపు మలుపులు, రద్దీ ప్రంతాలు, ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ శాఖాధికారులు ఇటీవల స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అయితే వీటిలో కొన్ని ఇప్పటికే కొందరు వ్యక్తులు తొలగించగా తాజాగా తేగడలోని మూలమలుపు వద్ద ఏర్పాటు చేసిన రెండు స్పీడు బ్రేకర్లలో ఒకదాన్ని తొలగించారు. రాత్రిపూట ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనాలు బ్రేకర్లను దాటే సందర్భంలో వచ్చే శబ్దాలతో తాము నిద్రలేని రాత్రులు గడుపుతున్నామంటూ ఓ కుటుంబం దీనిని తొలగించింది. ఈ స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయక ముందు ప్రమాదభరితంగా ఎల్ ఆకారంలో ఉన్న ఈ మూల మలుపులో నిత్యం ప్రమాదాలు జరిగేవని, వేగంగా వచ్చే ద్విచక్రవాహనాలు, ఆటోలు, బస్సులు, లారీలు వేగంగా ప్రయాణించి ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టేవని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలోని రోడ్డుదాటే విద్యార్థులు, మహిళలు, వృద్ధులకు స్పీడు బ్రేకర్లు తొలగించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న ఈ మలుపులో తొలగించిన స్పీడ్ బ్రేకర్ల స్థానంలో మళ్లీ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవాల దానం

మణుగూరుటౌన్: మణుగూరుకు చెందిన ఉమ్మనేని నర్సింహారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. బుధవారం బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందారు. కాగా మరణించిన నర్సింహారావు మరో ముగ్గురికి అవయవదానం చేసి ప్రాణదాతగా నిలిచారు. కాగా కుటుంబసభ్యులు నర్సింహారావు మరణానంతరం కళ్లు, లివర్, కిడ్నీలు దానం చేసేందుకు అంగీకరించడంపై సోషల్‌మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తాయి. అయితే మృతుడి భౌతికకాయాన్ని స్వగ్రామమైన ఏన్కూరు తీసుకెళ్లి దహన సంస్కారాలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చర్ల: మండలంలోని రాళ్లగూడెంకు చెందిన ఓ నిరుపేద వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండగా.. మీ కోసం మేమున్నాం సంస్థ దాతల ద్వారా సేకరించిన ఆర్థిక సాయాన్ని బాధితుడికి అందజేసింది. బుధవారం మండల కేంద్రంలోని మీ కోసం మేమున్నాం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.12,500 నగదును బాధితుడు యాలం నర్సింహారావుకు సంస్థ సభ్యులు నీలి ప్రకాశ్, పున్నం రామకృష్ణ, కొమరవరపు రవి, దొడ్డి సూరిబాబు, దొడ్డి రామ్మోహన్‌రావుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మేదరి కులస్తులను ఎస్టీలుగా గుర్తించాలి

గుండాల: మేదరి కులస్తులను ఎస్టీలుగా గుర్తించాలని, కుల వృత్తికి ప్రభుత్వం రుణాలు మంజూరి చేయాలని మేదరి సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు యణమగండ్ల రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం వెదురు దినోత్సవాన్ని మేదరి కులస్తులు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్సిడీ ద్వారా నాణ్యమైన వెదురు అందించాలన్నారు. తమకు ప్రభుత్వం అండగా నిలబడాలని డిమాండ్ చేశారు. వాసం నాగేశ్వరరావు, నాగమణి, శివ, సమ్మయ్యలు పాల్గొన్నారు.

అడవులను సంరక్షించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పాయం సత్యనారాయణ

దుమ్ముగూడెం: అడవులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందని గోడ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని పెద్ద నల్లబెల్లి గ్రామంలో మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తవరపు జానకిరామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2005 సంవత్సరం అటవీ హక్కుల చట్టం ప్రకారంగా అర్హులైన అందరికీ పట్టాలు ఇవ్వాల్సిందేనని సంబంధిత ఫారెస్ట్ అధికారులను కోరారు. భూమిలేని పేద ఆదివాసీలను గుర్తించి వారికి పోడు భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్లాంటేషన్లో ప్రైవేట్ వాచర్‌గా పనిచేసిన ఒక వ్యక్తి నూతన అటవీహక్కుల చట్టాల ప్రకారం అమాయక ఆదివాసీలపై కేసులు నమోదయ్యే విధంగా ఆదివాసీలను పక్క దారి పట్టిస్తున్నాడని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అడవులను కాపాడడంలో ఆదివాసులు ముఖ్య పాత్ర పోషించాల్సి బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి కిస్ట శ్రీనివాసరావు, వాల్మీకి, మాన్సింగ్, గోండు కిషోర్ కుమార్, బుదురాం, గోకుల్ గోండు తదితరులు పాల్గొన్నారు.

50 వసంతాల పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

గుండాల: ఈ నెల 30వ తేదీన హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే పీడీఎస్‌యూ 50 వసంతాల సభకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం ఇల్లందు డివిజన్ కార్యదర్శి బానోత్ నరెందర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ ఆవిర్భావం నుంచి విద్యార్థుల హక్కుల కోసం, దోపిడీ ఈపీడన లేని సమసమాజం కోసం పోరాడుతూ అశ్రీత పక్షపాతం అవినీతికి వ్యతిరేకంగా కుల వివక్షత, మతోన్మాదం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతుందని తెలిపారు. నేటి పాలకులు అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ తమ సంఘం పోరాడుతుందని అన్నారు. ఈ 50 వసంతాల సభకు అధిక సంఖ్యలో హాజరై సభ విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హేమంత్, రవి, నరేష్, సఫియా, అఖిల, హర్షశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు వీడ్కోలు

ములకలపల్లి: వినాయక నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూర్తి చేసిన భక్తులు ఘనంగా వీడ్కోలు పలుకుతున్నారు. స్థానిక కమిటీల ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ స్టెప్పులు, కోలాటాల నృత్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. అనంతరం మూకమామిడి ప్రాజెక్ట్‌లో నిమజ్జనం చేశారు.

చర్ల: మండల కేంద్రంలోని గణేష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన గణేషుని మండపం వద్ద బుధవారం భారీ అన్నదానాన్ని నిర్వహించారు. గణేష్ నవరాత్రి మహోత్సవాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అన్నదానంలో సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొన్నారు. అన్నదానానికి హాజరైన భక్తులకు ఉత్సవ కమిటీ గణేషుడి తీర్థప్రసాదాలను అందజేసింది.

పాల్గొన్న ఎమ్మెల్యే..

భద్రాచలం: భద్రాచలంలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాల్లో జరిగిన అన్నదానాల్లో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బుధవారం పాల్గొన్నారు. డిపో యూత్, మల్టీ బాయ్స్, కింగ్స్ యూత్, పాత మార్కెట్‌లో కూరగాయల దుకాణాల ఆధ్వర్యంలో, అశోక్‌నగర్ కాలనీ మండపాలను సందర్శించారు. అదేవిధంగా సాయంత్రం నిమజ్జన ఘాట్‌ను సందర్శించి అధికారులకు పలు సలహాలు, సూచనలను అందజేశారు.


ములకలపల్లి: వినాయకుడి శోభాయాత్ర దృశ్యం


భద్రాచలం: ఎమ్మెల్యే వెంకట్రావును సత్కరిస్తున్న కింగ్స్ యూత్ సభ్యులు

చట్టాలపై అవగాహన తప్పనిసరి


సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: విద్యార్థులు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని చర్ల రోడ్డులోని క్రాంతి పాఠశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, విద్యాహక్కు చట్టం, లైంగిక వేధింపులు, బాలకార్మిక నిషేధ చట్టం, బాల్య వివాహాలు, పోక్సోచట్టం, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను చెడు అలవాట్లకు దూరంగా ఉంచాలన్నారు. అనంతరం పోలీసులతో లోక్ అదాలత్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. క్రాంతి పాఠశాల చైర్మన్ పానుగంటి సమత, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య, పట్టణ ఎస్సై విజయలక్ష్మి, సీనియర్ న్యాయవాదులు నాగ అంబేడ్కర్, పడిసిరి శ్రీనివాసరావు, కోర్టు సిబ్బంది, ఇతర న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులే పోరాట వారసులు

దుమ్ముగూడెం: వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం నవాబు పాలనను అంతమొందించి, వెట్టి చాకిరి నుంచి ప్రజలకు విముక్తి కలిగించింది కమ్యూనిస్టు లేనని సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య అన్నారు. బుధవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా మండల పరిధిలోని మారాయిగూడెం గ్రామంలో యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ.. ఆనాడు జాగిర్దారులు,జమీందారులు వేల ఎకరాల భూములు ఆక్రమించి ముఖ్యంగా ఆదివాసుల ను అనేక ఇబ్బందులు గురి చేశారని వారిని ఎదిరించి ప్రజల తరపున పోరాటం చేసిన మన్యం పులి సోయం గంగులు అని కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 4,000 మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలు బలిదానం చేశి పది లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచారని, 3500 గ్రామాలను వెట్టి చాకిరీ నుండి విముక్తి కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చంద్రయ్య సోందె అర్జున్, సున్నం వెంకటేశ్వర్లు, తోడం ఎర్రయ్య, సోందె ఎర్రయ్య, చిన్నమి, తాయిలమ్మ, జయలక్ష్మి, ఎండి.అజీజ్, రామమ్మ, రమణమ్మ, శాంతమ్మ, సందీప్, రాజు, జంపన్న, బుచ్చమ్మ, సురేష్, తొడం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రివైజ్డ్ పెన్షన్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మణుగూరుటౌన్: మణుగూరు అధికారుల నిర్లక్ష్యం వల్ల స్థానిక సింగరేణీయుల పెన్షన్ పెండింగ్‌లో ఉంటోందని, వెంటనే రివైజ్డ్ పెన్షన్ అమలు చేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల మణుగూరులో జరిగిన పెన్షన్ లోక్ అదాలత్‌లో మణుగూరు అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారని సీఎంపీఎఫ్ అధికారులు హెచ్చరించినప్పటికీ ఇక్కడి అధికారులు మాత్రం మొద్దనిద్ర వీడకపోవడం సమంజసం కాదన్నారు. దీని వల్ల దాదాపు 80 మంది మాజీ కార్మికులు.. ఒక్కో కార్మికుడు రూ.3 నుంచి 10వేలు బేసిక్ ప్రకారం నష్టపోతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై యాజమాన్యానికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 10 మార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదని విమర్శించారు. సమావేశంలో సర్వర్, ఇమాముద్దీన్ తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి

మణుగూరురూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని కూనవరం ఎంపీయూపీఎస్ ప్రధానోపాధ్యాయుడు షేక్ మీరాహుస్సేన్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకూడదని, చెత్తబుట్టలను వినియోగించాలని సూచించారు. చెత్తాచెదారం వల్ల దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు కె.సారయ్య, రుక్మిణి, సరిత, జగన్మోహన్‌రావు, రేగా విజయలక్ష్మి, అనిత, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బోర్డులు ఏర్పాటు చేయాలి

మణుగూరురూరల్: మండలంలోని మణికంఠానగర్ గ్రామానికి వెళ్లే మూలమలుపు ప్రమాదకరంగా మారిందని, వెంటనే అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ నాయకులు మూలమలుపు ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా దుర్గ్యాల సుధాకర్ మాట్లాడుతూ.. మణికంఠానగర్ మూలమలుపు ప్రమాదకరంగా దర్శనమిస్తోందని, ఈ మార్గం గుండా రాకపోకలు సాగించాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి సీతారాములు, నాగేశ్వరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దోమలమందు పిచికారీ

మణుగూరురూరల్: సీజనల్ వ్యాధుల నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పగిడేరు గ్రామ పంచాయతీలోని శాంతినగర్, పగిడేరులలో దోమల మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ... వర్షాకాల నేపథ్యంలో కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ వంటివి ప్రబలే అవకాశం ఉందన్నారు.

దోమలు నివారణ కోసం ప్రతీ ఒక్కరూ తమ ఇళ్లలో ఐదు శాతం ఐఆర్ఎస్-ఏసీఎం ద్రావణాన్ని పిచికారి చేయించుకోవాలని సూచించారు. అనంతరం దమ్మక్కపేట, చిక్కుడుగుంట గ్రామాల్లో వైద్యశిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నిశాంత్‌రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ వీరస్వామి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, సుజాత, కనకదుర్గ, కౌసల్య, రజనీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం


అశ్వారావుపేటరూరల్: కబడ్డీ ఆడుతున్న బాలికలు


దుమ్ముగూడెం: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ అశోక్

అశ్వారావుపేటరూరల్: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక వ్యవసాయ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఈ క్రీడా పోటీలను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో విద్యార్థులు తమ సత్తా చూపించాలని అన్నారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచే వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికు ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ పోటీలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన అండర్ 14, అండర్ 17 విభాగంలో బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కీసరి లక్ష్మీ, ఎంఎన్ఓ ప్రసాదరావు, షహీనా బేగం, ఎంపీ రావు, లక్ష్మీ నర్సు గౌడ్, పి.రాము, నాగేశ్వరరావు, పీఈటీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెం బాలుర ఆశ్రమ పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి ఆటల పోటీలను బుధవారం ప్రారంభించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు అండర్-14, అండర్-17 పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారిని జోనల్ గేమ్స్‌కు పంపిస్తారు. ఆటల పోటీల ప్రారంభ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్ పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సున్నం సమ్మయ్య మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడి జోనల్, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్ఓ రామారావు, పర్ణశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌యం ఏజే ప్రభాకర్, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండల స్థాయి పాఠశాలల క్రీడాపోటీలను మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు బుధవారం ప్రారంభించారు. 12 పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ అండర్ 14లో స్థానిక సెయింట్ జోసఫ్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. మద్దుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. వాలీబాల్ అండర్ 17 విభాగంలో చంద్రుగొండ జెడ్పీ విద్యార్థులు, రన్నర్స్‌గా, మద్దుకూరు విద్యార్థులు విన్నర్స్‌గా నిలిచారు. ఖోఖో అండర్ 14లో విన్నర్స్‌గా మద్దుకూరు పాఠశాల విద్యార్థులు, రన్నర్స్‌గా తిప్పనపల్లి యూపీఎస్ పాఠశాల విద్యార్థులు, ఖోఖో అండర్ 17లో చంద్రుగొండ జెడ్పీ పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా, మద్దుకూరు పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. ఈ క్రీడా పోటీలను ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఎంఈఓ ఎస్.సత్యనారాయణ, క్రీడాపోటీల కన్వీనర్ మధు, సెక్రటరీ సృజన, పీడీలు లక్ష్మణ్, నరేష్, పీఈటీలు అనిత, రజనీ, ఆఫ్రీన్, కృష్ణ, జయరాం పాల్గొన్నారు.

దమ్మపేట: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని దమ్మపేట మండల ఎంఈఓ కీసరి లక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆమె మండల స్థాయి క్రీడా పోటీలను పార్కాలాగండి బాలుర పాఠశాలలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. క్రీడా పోటీల్లో సుమారు 14 పాఠశాలల నుంచి 320మంది బాలికలు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల ఎంపీడీఓ, మాజీ ప్రజా ప్రతినిధులు,పలు పాఠశాలలు హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భద్రాచలంలో..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో రేపటి (శుక్రవారం) నుంచి మండల స్థాయి పాఠశాల క్రీడలు నిర్వహించడం జరుగుతుందని మండల క్రీడల కన్వీనర్ జి.పద్మజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 20న బాలికలకు, 21వ తేదిన బాలురకు నిర్వహిస్తామని, పూర్తి వివరాలకు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రమేష్ 8074606654 నంబర్‌ను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.